క్లుప్తంగా

పరిశోధనాత్మక గ్రంథం ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పెద్దాడ జగదీశ్వరావు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఇంగ్లీష్ అధ్యాపకుడు రాకోటి శ్రీనివాస రావు రచించిన పరిశోధన గ్రంథం 'ఏ క్రిటికల్ ఎనాలసిస్ ఆఫ్ హ్యూమన్ ప్రెడికమెంట్ ఇన్ ద సెలక్ట్ నావల్స్ ఆఫ్ చామన్ నహల్'ను శనివారం పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, ఏవో మునిరామకృష్ణ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగించాలి



మాట్లాడుతున్న పారిశుద్ధ్య కమిటీ కన్సల్టెంట్ అమ్మాజీ

గార: బహిరంగ మలవిసర్జన ద్వారా అనారోగ్యం కలుగుతుందని, మరుగుదొడ్లు వినియోగించాలని జిల్లా నీరు, పారిశుద్ధ్య కమిటీ కన్సల్టెంట్ అమ్మాజీ అన్నారు. శనివారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శ్రీకూర్మం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మరుగుదొడ్ల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, డీఈ శంకరరావు, మురళీమోహన్, సెక్రటరీ చెట్టు శంకరరావు, హెచ్‌ఎం కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా ఎంటర్‌ప్రెన్యువర్‌గా రాధారాణి



అవార్డు అందుకుంటున్న దానేటి రాధారాణి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉమెన్ ఎంటర్‌ప్రెన్యువర్‌గా ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ట్వింకిల్ కిడ్స్ స్కూల్ అధినేత్రి దానేటి రాధారాణికి జిల్లా నుంచి ఉత్తమ అవార్డు అందించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యువర్స్ ఇండియా ఏపీ చాంబర్స్ ఆధ్వర్యంలో విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతులమీదుగా శనివారం ఈ అవార్డు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు సీఈఓ వి.ఆర్.విజయరాఘవనాయక్, సీటడబ్ల్యూఈ చైర్‌పర్సన్ సౌదామణి, గీతాశ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని బాలికల అంబేడ్కర్ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రవల్లిక, పదో తరగతి విద్యార్థి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

కథా రచయిత చినరామినాయుడు మృతి



శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రముఖ కవి, కళాకారుడు, కథా రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు చింతాడ చినరామినాయుడు(91) శుక్రవారం మృతిచెందారు. ఈయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. భార్య అమ్మాజమ్మ 17 ఏళ్ల క్రితమే మృతిచెందారు. పొందూరు మండలం గోకర్ణపల్లిలో 1933 మేలో జన్మించిన చినరామినాయుడు బహుభాషా కోవిదుడిగా, కవిగా, కళాకారుడిగా జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఉపాధ్యాయునిగా వేలాది మందికి బోధించారు. ఈయన మృతి పట్ల సోదరులు, మాజీ సర్పంచ్ చింతాడ సత్యప్రసాద్, గోకర్ణపల్లి సర్పంచ్ చింతాడ మాధురి, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆటో బోల్తాపడి పలువురికి గాయాలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఆదివారంపేట పరిసర ప్రాంతంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వైపు వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన కొంతమంది రిమ్స్‌కు, మరికొందరు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

• అయ్యప్ప దేవాయనమః



శ్రీకాకుళంలోని కంపోస్టు కాలనీ వద్ద అయ్యప్ప సన్నిధానం ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా వేదిక విశేషంగా ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున అయ్యప్పస్వాములు పాల్గొని భజనలు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్



• కోటేశ్వరునికి దశవిధ హారతులు

శ్రీకాకుళం గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం దశ విధ హారతుల కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామ మూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్



• ఉమాజఠలేశ్వరునికి పుష్పార్చన

శ్రీకాకుళం నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అశ్వినీకుమార్, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

సత్యసాయి జయంతి వేడుకలు ప్రారంభం



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న బ్యాంకర్స్ కాలనీ సభ్యులు



న్యూకాలనీలో సామూహిక సాయివ్రతాలు



పెద్దమందిరంలో కేక్ కట్‌చేస్తున్న సాయిభక్తులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్యాంకర్స్ కాలనీలోని సాయి బృందావనం, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గార మండలం జల్లపేటలో సేవా కార్యక్రమాలు నిర్వహించామని మందిరం కన్వీనర్ ప్రసాదరావు తెలిపారు. పల్లకీసేవతో పాటు మొక్కలు నాటినట్లు చెప్పారు. న్యూకాలనీ చిన్నపుట్టపర్తి మందిరంలో సామూహిక సాయి వ్రతాలు నిర్వహించామని మందిర కన్వీనర్ జయరాం గుప్త తెలిపారు. పాలకొండ రోడ్డులో సత్యసాయి సేవాసమితి పెద్దమందిరంలో కేక్ కట్ చేసినట్లు మందిరం కన్వీనర్ మురళీకృష్ణ చెప్పారు. ఎం.ఎస్. ప్రకాశరావు నిర్వహణలో సత్యసాయి వ్రతాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమార్, కిల్లాన ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయాలి



జి.సిగడాం: సంతవురిటిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో ఈ నెల 27న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కోరారు. లావేరు మండలం గురుగుబిల్లి గ్రామ సచివాలయం పరిధిలో స్థానిక నాయకులతో కలిసి శనివారం బస్సుయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 98 శాతం హామీలు నెరవేర్చామని, ప్రభుత్వం పట్ల ప్రజలు నమ్మకంతో ఉన్నారని చెప్పారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. బస్సు యాత్ర విజయవంతానికి అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, నాయకులు రొక్కం బాలకృష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొర్లె అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని పెనసాం, నడిమివలస, ఎందువ, గెద్దకంచరాం, బాతువ, పున్నాం, డి.ఆర్.వలస, జాడ, జగన్నాథవలస, జి.సిగడాం, పెంట, సీతంపేట, పాలఖండ్యాం, సంతవురిటి, మెట్టవలస, టిడివలస గ్రామ సచివాలయాల్లో శనివారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సుడిగాలి పర్యటించారు. ఈ నెల 27న జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, వైస్ ఎంపీపీలు తోలేటి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పిల్లల శివకుమార్ పాల్గొన్నారు.

బాల సంస్కార కేంద్రాల టీచర్లకు శిక్షణ



శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

రణస్థలం: మత్స్యకార గ్రామాల్లో విద్యార్థులకు దేశభక్తి గీతాలు, సుభాషితాలు, మానవ నైతిక విలువలు, ఆసనాలు, ఆటలు నేర్పించేందుకు బాల సంస్కార కేంద్రాల ఉపాధ్యాయులకు ఏపీ మత్స్య సంక్షేమ సమితి సారథ్యంలో శిక్షణ ఇస్తున్నామని ఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోలయ్య తెలిపారు. రణస్థలం మండలంలోని ఎన్ఈఆర్ స్కూల్ బాల సంస్కార కేంద్రాల ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని 36 గ్రామాల్లో బాల సంస్కార కేంద్రాలు ఏర్పాటు చేర్పాటు చేసినట్లు తెలిపారు. రణస్థలం మండలం కొవ్వాడ, అల్లివలస, ఎన్‌జీఆర్.పురం, జీరుపాలెం, కొత్తముక్కాం గ్రామాలు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ విద్యా విభాగం అధ్యక్షుడు యు.మహేష్, ఆర్ఎస్ఎస్ డి.వి.రమణమూర్తి, జిల్లా అధ్యక్షుడు పొట్టివాడు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకు ప్రాధాన్యం



రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

ఎచ్చెర్ల క్యాంపస్: రబీలో రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్ సూచించారు. ధర్మవరంలో శనివారం రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ నీటి వినియోగం పంటలకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. చోడి, మినుము, పెసలు, వేరుశనగ, మొక్కజొన్న వంటి పంటలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం రాయితీపై విత్తనాలు అందిస్తుందన్నారు. అనంతరం విత్తనాలు, ఈ-క్రాప్ ధ్రువీకరణ పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏబీ బి.రజని, ఏఓ వై.సురేష్, ఎంపీటీసీ బగ్గు రాజారావు పాల్గొన్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర



గోమాతకు పూజ చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

రణస్థలం: గోపాష్టమి (గోమాత జన్మదినోత్సవం) సందర్భంగా జగన్నాథ, సుభద్ర, బలరాముల రథయాత్ర ఆదివారం నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ చైతన్య మఠం, గోసేవా ఆశ్రమం పీఠాధిపతి బి.ఎస్.కేశవ్ మహారాజ్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభమౌతుందన్నారు. మరుసటి రోజు కోష్టలోని గోసేవా ఆశ్రమంలో సుదర్శన నారసింహ యిష్టి, గోపూజ, గోహారతి, గో ప్రదక్షిణ, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన 300కు పైగా గోమాతలకు విశిష్ట పూజలు చేస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎంపీగా జిల్లాకు చేసిందేంటి?

• రామ్మోహన్‌నాయుడికి తమ్మినేని చిరంజీవినాగ్ సూటిప్రశ్న

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కరువు మండలాలను ప్రకటించాలంటే ఒక్క వర్షపాతమే ఆధారం కాదని హైడ్రాలజికల్ పారామీటర్స్, రిజర్వాయర్‌లో నీరు, నీటిపారుదల, భూగర్భజలాలు, భూమిలో తేమ శాతం వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటారన్న విషయం ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు తెలియదా అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధానకార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన జిల్లాల జాబితాను టీడీపీ ప్రభుత్వ హయాంలో నీతిఆయోగ్ అడిగితే శ్రీకాకుళం జిల్లా పేరును ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. ఆ తర్వాత ఐదు జిల్లాల పేర్లు ఇవ్వమంటే అప్పుడు ప్రతిపాదించారని గుర్తుచేశారు. అప్పట్లో గుర్తుకురాని శ్రీకాకుళం జిల్లా ప్రజలు, రైతులపై ఇప్పుడెందుకు సవతిప్రేమ వచ్చిందో చెప్పాలన్నారు. ఎన్నికల దగ్గరవుతుండటంతో ఎక్కడలేని ప్రేమాభిమానాలు పుట్టుకొస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 680 మండలాలు ఉండగా 80 మండలాలు తీవ్రమైన కరువు, 23 మోస్తరు కరువు మండలాలుగా అక్టోబర్ 23న ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలియదా?అని ప్రశ్నించారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జె.ఆర్.పురం ఎస్సై రాజేష్ (ఇన్‌సెట్లో) మహంతి బాలకృష్ణ (ఫైల్)

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం ఏపీటోరియా (అరబిందో) పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న ఎలక్ట్రీషియన్ మహంతి బాలకృష్ణ(34) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానిక కార్మికులు, సీఐటీయూ నాయకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీటోరియా పరిశ్రమలోని కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ శనివారం ఉదయం 9 గంటలకు జనరల్ షిఫ్ట్‌కు వెళ్లాడు. పెన్సిలిన్ ప్లాంట్ ప్రొడెక్షన్ బ్లాక్-1లో బ్లూవేర్ రూంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు, యాజమాన్యం సహకారంతో పరిశ్రమ అంబులెన్స్‌లో విజయనగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శవపంచనామా నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని స్వగ్రామం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం రెల్లివలస. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ తెలిపారు. కార్మికుడి కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలని పరిశ్రమ యాజమాన్యాన్ని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

విషయ పరిజ్ఞానం కీలకం

ఎచ్చెర్ల క్యాంపస్: మేనేజ్‌మెంట్ విద్యార్థులు విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యమివ్వాలని భారతీయ స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె.సిద్ధార్థ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మేనేజ్‌మెంట్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజ్‌మెంట్ పిత పీటర్ డెక్కర్‌కు నివాళులు అర్పించారు. కోర్సు కోఆర్డినేటర్ కూన అచ్యుతరావు, ఫ్యాకల్టీ సభ్యులు నీలం సంతోష్ రంగనాథ్, కె.కరుణానిధి, ఎం.చిన సుబ్బారావు, బి.ప్రకాష్‌బాబు, తారకేశ్వరరావు, శివనాగేశ్వరరావు, రాంజీనాయక్, తమ్మినేని సంతోషిపావని పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో తొమ్మిది మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. మై కెరీర్ బిల్డ్ కంపెనీ నిర్వహించిన ఎంపికల్లో ట్రిపుల్‌ఈ, ఈసీఈ, సీఎస్‌ఈ ఇంజినీరింగ్‌కు చెందిన 62 మంది హాజరుకాగా.. రాత, సాంకేతిక, మౌఖిక అంశాల్లో 9 మంది ఎంపికయ్యారు. కంపెనీ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రూ.3.6 లక్షల వార్షిక ప్యాకేజీతో విశాఖపట్నంలో వీరికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రామ్మూర్తినాయుడు అభినందించారు.

శ్రీకాకుళం అసెంబ్లీ కన్వీనర్‌గా పైడి

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం అసెంబ్లీ కన్వీనర్‌గా పైడి వేణుగోపాలాన్ని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈయన పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర పదాధికారిగా సేవలందిస్తున్నారు.

పుట్టుకతో లోపాలున్న పిల్లలకు సత్వర చికిత్స

శ్రీకాకుళం: పుట్టుకతో లోపాలు ఉన్న పిల్లలకు సత్వర చికిత్సా కేంద్రం (డైస్)లో ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు రాష్ట్రీయ స్వాస్థ్య జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సి.పి.శ్రీదేవి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని డైస్ కేంద్రం, జిల్లా ఆస్పత్రి టెక్కలి కేంద్రంలో బాలల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డైస్ పీడియాట్రిషన్ డాక్టర్ ఎస్.చైతన్య, డాక్టర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్యపు విలువలు పెంపొందించాలి



కవులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: కవులు భవిష్యత్ తరాల విద్యార్థుల్లో సాహిత్యపు విలువలు పెంపొందించాలని ఏపీజీవీబీ సభ్యుడు జి.రాజేష్ అన్నారు. శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయంలో 56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం కవితా దినోత్సవం ఘనంగా జరిగింది. డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, కవులు మహ్మద్ రఫీ (ఈవేమన), గుడిమెట్ల గోపాలకృష్ణ, చాడ శ్రీనివాస్, ప్రసాద్, ఉమాకవి, సంతోష్, మోహన్‌గాంధీ, రాజారావు, వావిలపల్లి రాజారావు, కె.రంగనాయకులు, దుర్గాప్రసాద్, జంధ్యాల శరత్‌బాబు, శంకరరావు, రమణమూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు



జస్టిస్ ప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని చండీఘడ్ బెంచ్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ జస్టిస్ పి.ఎస్.ఎన్.ప్రసాద్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎస్.చక్రధరబాబు కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.ఈయన వెంట స్థానిక తహశీల్దార్ ఎం.వెంకటరావు, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు ఉన్నారు. అదే విధంగా, శ్రీకాకుళం జిల్లాకు 1976–78 సమయంలో కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ సురేంద్ర కుమార్ పచౌరి కుటుంబ సమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో అరసవల్లి క్షేత్రం చాలా చిన్నదని..ఇప్పుడు పెద్ద పుణ్య క్షేత్రంగా మారిందని సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణం బాగా అభివృద్ధి చెందిందన్నారు. తాను ప్రస్తుతం ఆమిటీ యూనివర్శిటీ (నోయిడా) విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

జి.సిగడాం: సంతవురిటి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం రైతులకు రాయితీపై పెసలు, రాగులు, మినుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పిల్లల శివకుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం జగనన్న ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. కార్యక్రమంలో ఏఏ లక్ష్మీనారాయణ, ఎఫ్ఏ రామ్‌జీ, బత్తుల రాము పాల్గొన్నారు.